క్లుప్తంగా

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

నవాబుపేట: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్, యన్మన్ గండ్ల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. శనివారం వారు కళాశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర వసతులు ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఈనెల 5వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారన్నారు.

నేడు ఆర్యసమాజ వార్షికోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్యసమాజ 71వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు సభ అధ్యక్షుడు గుబ్బ నర్సింహులు తెలిపారు. వేడుకల్లో భాగంగా దయానంద సరస్వతి 201వ జయంతిని నిర్వహిస్తారన్నారు. ఉదయం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం మాధవీయం నుంచి ఆర్యసమాజం వరకు శోభాయాత్ర, 11గంటలకు దేవయజ్ఞం ఉంటుందన్నారు. ఆర్యప్రతినిధి సభ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, ఉపాధ్యక్షుడు శివకుమార్, వైదిక ఉపన్యాసకులు వేదసింధు హాజరవుతారన్నారు.

బీసీ జేఏసీ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రి యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీసీ సంఘాలతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

వేస్టేజీ వస్తువులు కొనొద్దు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని స్క్రాప్ దుకాణదారులు ఎట్టి పరిస్థితులలోనూ స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్ల నిర్వాహకుల నుంచి వేస్టేజీ వస్తువులు (వాడిన పాత ప్లాస్టిక్, ఇను ము, పుస్తకాలు, అట్టలు) కొనవద్దని మున్సిపల్ అధికారులు సూచించారు. సుమారు 15 మందికి శనివారం నోటీసులు అందజేశారు. ఒకవేళ ఎక్కడైనా ఇలాంటి వాటిని కొనుగోలు చేసినట్లు తమదృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తికి గాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని అమ్మాపూర్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని గోపన్‌పల్లికి చెందిన వేణుసాగర్ బైక్‌పై దేవరకద్రకు వస్తుండగా అమ్మాపూర్ రోడ్డులో ప్రమాదం జరిగింది. ఈఘటనలో గాయపడ్డ వేణుసాగర్‌ను ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

రాజాపూర్: మండలంలోని మోత్కులకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రావ్, ఉదయ్‌కుమార్, భాస్కర్, తిమ్మారెడ్డి, రేణుక, సతీష్‌రాథోడ్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా హర్షిక,డీఈఓగా శ్రావణ్‌తేజ, మండల విద్యాధికారిగా మాదియ తబాసుం, ప్రధానోపాధ్యాయులుగా ఖమేష్ తబసుంలతో పాటు 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

రుణాలను సకాలంలో చెల్లించండి



మహమ్మదాబాద్: డ్వాక్రా సంఘాల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని బీఎల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని కంచన్‌పల్లి డ్వాక్రా సంఘాల్లో రుణాలు తీసుకుని చెల్లించని వ్యక్తిపై గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం పీఎం నర్సింహస్వామి, పీడీ వెంకట్ ఆధ్వర్యంలో మహిళాసంఘాలతో కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మహిళలను మోసం చేసే విధంగా రుణం తీసుకొని చెల్లించక ఇబ్బందులు పెట్టడంతో ఎలాగైనా తీసుకున్న రుణాన్ని వసూలు చేయాలని ఆదేశించారు. శ్రీనిధి తీసుకున్న మహిళలు కూడా క్రమం తప్పకుండా చెల్లించాలని, అధికారులు మళ్లీ రుణాలు ఇస్తారని తెలిపారు. ఏపీడీ జోజన్న, ఏపీఎంలు బాలకృష్ణ, సునిత సీసీలు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి‘లో నీడ కరువాయె



నవాబుపేట హాజిలాపూర్‌లో ఉపాధి పనిలో కూలీలు

- కానరాని కనీస సౌకర్యాలు
- కూలీలకు తప్పని తిప్పలు

నవాబుపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. ‘ఉపాధి‘లో పని చేసే కూలీకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఎండాకాలంలో వారు సేద తీరేందుకు పని ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా కూడా ‘ఉపాధి‘ కూలీలకు నీడ కోసం ఏర్పాట్లు చేసిన దాఖలు లేవు. అలాగే తాగునీరు, మెడికల్ కిట్లు సైతం అందుబాటులో ఉంచాల్సి వాటి ఊసే లేదు. పని ప్రాంతంలో ఏదైనా జరిగితే ఊర్లోకి కానీ, మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. ముఖ్యంగా గ్రామాల్లో కందకాల తవ్వకం కొనసాగుతున్న తరుణంలో పనిచేసే స్థలం గ్రామాలకు చాలా దూరంగా ఉంది. దీంతో కూలీలకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

మండుటెండలో పనిచేస్తున్నాం



మండుటెండలో పనిచేస్తున్నాం. కాస్త సేద తీరేందుకు నీడ కరువైంది. మూడేళ్ల క్రితం టెంట్ కవర్లు ఇచ్చారు. కానీ వాటి జాడ లేదు. తాజాగా ఫాంఫండ్ పనులు చేస్తున్నాం. పనికి దాదాపుగా రెండు కిలోమీటర్ల దూరం వస్తాం. ఎండలో తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

– బాబునాయక్, హాజిలాపూర్

పంచాయతీలే సమకూర్చాలి

మూడేళ్ల నుంచి కొత్త పనిముట్లు రాలే. వాటికి సంబంధించి కూలీలకే డబ్బులు అదనంగా వస్తాయి. వేసవిలో కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కల్పించాలని కవర్లు, తాగునీరు తదితర సదుపాయాలను గ్రామ పంచాయతీలే సమకూర్చాలి. ఉపాధి హామీ పనుల విషయంలో చాలా బాధ్యతలు పంచాయతీలవే.

–జయరాంనాయక్, ఎంపీడీఓ, నవాబుపేట

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కొత్తగా ఏర్పడిన దేవరకద్రను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని బలుసుపల్లి, పెద్దగోప్లాపూర్, మీనుగోనిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నివేదికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ సుందరీకరణకు, తాగునీటి ఎద్దడి నివారణకు, డివైడర్ నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతు కృషిచేస్తానని, దీనికిగానూ కనీసం రూ.100 కోట్లు కావాలని సీఎంను కోరుతామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీత్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఫారూఖ్, నాయకులు జవహర్, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వర్మ, రాంపాండు పాల్గొన్నారు.

మన్యంకొండలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ అళహ రి మధుసూదన్‌కుమార్ ఎమ్మెల్యే దంపతులకు స్వా మివారి శేషవస్త్రంతో సన్మానించి ఆలయ విశిష్టతను వివరించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి ఉన్నారు.

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

అడ్డాకుల: కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారంబ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 6 వరకు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే సతీమణి కవిత, ఈఓ రాజేశ్వరశర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, రవీందర్‌శర్మ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవరకద్ర: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ బలరాం శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. డోకూర్ పాఠశాలలో విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ నిర్మించాలని, దేవరకద్ర జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రహరీని నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో నిధులు మంజూర్ చేసి పనులు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

‘యూపీఎస్’తో ఉద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం

సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్



యుద్ధభేరి పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ పేరుతో ఉద్యోగులను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోనీ సీపీఎస్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2.50లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏళ్లతరబడి పోరాటం చేస్తున్నారన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి అమలుచేయనున్న యూపీఎస్ విధానంతో ఉద్యోగుల జీవితాలు దుర్భరంగా మారుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. యూపీఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 2న హైదరాబాద్‌లో ‘యుద్ధభేరి’ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఆదివారం ఉదయం జెడ్పీ గ్రౌండ్ నుంచి ‘యుద్ధభేరి’కి బయలు దేరనున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, సీపీఎస్ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మహమ్మదాబాద్: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కంచన్‌పల్లిలో సైబర్‌నేరాలపై తగిన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను తగిన జాగ్రత్తలతో వినియోగించుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రాజాపూర్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ శివానందంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కుచ్చర్‌కల్‌రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. కారులో సీటుబెల్టు తప్ప నిసరి అని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. లేదంటే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సామర్థ్యాల పరిశీలన

జడ్చర్ల టౌన్: మండలంలోని ఉదండాపూర్ యూపీఎస్‌ను శనివారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 2వతరగతి విద్యార్థిని సాయిపల్లవి గణితంలో చతుర్విధ ప్రక్రియలను చక్కగా చేసినందుకు అభినందించారు. పాఠశాలలో అపార్ ఐడీలు 100శాతం జనరేషన్ చేయించాలని హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డికి సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ నిర్వహణ, సీసీఈ, ఎండీఎం పనుల నిర్వహణపై చర్చించారు. పాఠశాలలో బాలికల మరుగుదొడ్ల సమస్యగా ఉందని హెచ్‌ఎం ఆమె దృష్టికితెచ్చారు. స్పందించిన ఎంఈఓ అధి కారుల దృష్టికి తీసుకువెళ్తానని భరోసానిచ్చారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక భాగ్యనగర్ కాలనీలోని రోడ్ నం.9లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధిరి శివేంద్రప్రతాప్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ కమిటీ మాజీ అధ్యక్షుడు ఆశన్న, మాజీ ప్రధాన కార్యదర్శి చికిరాల పట్టాభి మాట్లాడారు. సుమారు 20 ఏళ్లుగా నివసిస్తున్నా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు చర్యలు చేపడుతుందని ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి నిర్మాణంలో పాటించవలసిన నాణ్యతను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వైద్యం భాస్కర్, ఎండీ పుష్పలత, మోహన్‌రెడ్డి, సంధ్యరాజేందర్, రాజన్న, చంద్రనాయక్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే హక్కు కవితకు లేదు



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. స్థానిక బీసీ సమాజ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడూ గుర్తుకు రాని బీసీలు ఈ రోజు గుర్తుకు వస్తున్నారని అన్నారు. అధికారానికి దూరమై ఏడాది గడిచిందని, మళ్లీ అధికారంలోకి రావడానికి బీసీల బాట పట్టడం సిగ్గుచేటన్నారు. బీసీల రాజ్యాధికారం, రిజర్వేషన్ల గురించి పోరాడేందుకు రాష్ట్రంలో చాలా మంది బీసీ మేధావులు, బీసీ రాజకీయ, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారని, మీరు అధికారం కోసం బీసీ వా దాన్ని ఉపయోగించుకోవాలని చూడడాన్ని బీసీ సమాజ్ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. వివిధ సంఘాల నాయకులు సారంగి లక్ష్మీకాంత్, అశ్వి ని సత్యం, సత్యనారాయణ సాగర్, బి.శేఖర్, విశ్వనాథం పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పార్టీ సస్పెండ్ చేయడాన్ని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ ఒక ప్రకటనలో ఖండించారు. బీసీ భావజాల వ్యాప్తికి అహర్నిశలు శ్రమిస్తున్న బీసీ గొంతుకైన తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడంతో కాంగ్రెస్ పార్టీ తన గోతిని తీసుకున్నట్లయిందన్నారు. భవిష్యత్తులో తీన్మార్ మల్లన్న తీసుకునే నిర్ణయానికి బీసీ సమాజం మొత్తం కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

మాదిగ అమరులకు నివాళి

జడ్చర్ల టౌన్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గాంధీభవన్, అసెంబ్లీ ముట్టడి, చలో కలెక్టరేట్ వంటి నిరసన కార్యక్రమాల్లో మృతిచెందిన వారి చిత్రపటాలను ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జంగయ్య మాదిగ, నాయకులు డి.కృష్ణయ్య, కొంగళినాగరాజు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ఏబీసీ వర్గీకరణ

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అనేక ఉద్యమాలతో ఏబీసీ వర్గీకరణ అమలైందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్సింహులు అన్నారు. తెలంగాణ చౌరస్తాలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు టీఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా ఘనంగా నివాళులర్పించారు. నాయకులు వెంకటస్వామి, గండి బాలరాజు, వెంకటయ్య, చెన్నకేశవులు, రమేష్, నర్సిములు, కృష్ణ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు ఘన నివాళులర్పించగా నాయకులు పాల్గొన్నారు.

త్యాగాలు మరువలేనివి..

దేవరకద్ర: ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దొబ్బలి ఆంజనేయులు అన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో మాదిగ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాడి అదే మార్గంలో అమరులైన మాదిగ సోదరులను గుర్తు చేసుకుందామన్నారు. నాయకులు చెన్నప్ప, రామస్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో మాదిగ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

అమరుల త్యాగం వృథా కాదు

మిడ్జిల్: మాదిగ దండోరా అమరుల త్యాగం వృథా కాదని, వారి లక్ష్యం నెరవేరే రోజులు దగ్గరలో ఉన్నాయని దండోరా జిల్లా నాయకుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన అమరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలయ్య, గణేష్, బుచ్చయ్య, రవీంద్ర, చందు, మహేష్, రాజు పాల్గొన్నారు.

భూత్పూర్ చౌరస్తాలో..

భూత్పూర్: ఎమ్మార్పీఎస్ ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి భూత్పూర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు గడ్డం యాదయ్య, రాములు, మండి అంజి, జగన్ యాదయ వీరస్వామి, పవన్ కళ్యాణ్ ఉన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రం శివారులోని మౌంట్ బాసిల్ హైస్కూల్ (ఎంబీహెచ్‌ఎస్)లో విద్యార్థులు విభిన్న అంశాలపై మొత్తం 354 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇవి ముఖ్యంగా ఆధునిక సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా, విపత్కర పరిస్థితులలో ప్రమాదం నుంచి ఎలా బయట పడాలి, ప్రకృతి వనరులను ఎలా కాపాడుకోవాలి వంటి ఎన్నో విషయాలు అందరికీ అవగాహన కలిగించేలా ఉన్నందున ఆహూతులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు గణిత శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి మహబూబ్‌నగర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వాసుదేవమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రాజెక్టులను తిలకించి ఎంతో బాగున్నాయని అయన కితాబునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, కరెస్పాండెంట్ పూజితామోహన్‌రెడ్డి, డైరెక్టర్లు శిరీష ప్రవీణ్‌కుమార్, సుశాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ మౌంట్ బాసిల్ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంవీఐ వాసుదేవమూర్తి

రకరకాల ప్రదర్శనలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని అడ్డాకుల గ్రామర్ స్కూల్‌లో శనివారం ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. రకరకాల ప్రదర్శనలను విద్యార్థులు నిర్వహించారు. ఎంఈఓ వి.కురుమూర్తి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జ్యోతి సైన్స్ ఫెయిర్‌ను సందర్శించారు. కరస్పాండెంట్ గోవర్ధన్‌చారి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

నవాబుపేట: స్థానిక ప్రాథమిక, సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. చిన్నారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం, రోడ్డు సేఫ్టీ వాటిని చూసి పలువురు విద్యార్థులను అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: కారూర్ శివారులో అక్రమంగా ఇసుకను తరిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న కృత్రిమ ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదుచేశారు.

తిరుమలకు పాదయాత్ర

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామం నుంచి పలువురు భక్తులు శనివారం తిరుమల తిరుపతి దేవస్థానానికి పాదయాత్ర చేపట్టారు. తమ గ్రామం పాడిపంటలు, సిరి సంపదలతో తులతూగాలని కాంక్షిస్తూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే మజ్లిస్ లక్ష్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: కుల, మతాలకతీతంగా పేదల సమస్యలను పరిష్కరించడమే (ఆలిండియా మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమిన్) ఏఐఎంఐఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ అన్నారు. శనివారం ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎస్‌బీహెచ్ మెయిన్ బ్రాంచ్ ఎదుట గల పార్టీ కార్యాలయ ఆవరణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ అడ్వకేట్, పట్టణ అధ్యక్షుడు సాధతుల్లా హుస్సేని, నాయకులు ముజంబిల్, జహంగీర్, మహెబూబ్, ముస్తాక్ రషీద్, ఇమ్రాన్ షరీఫ్, తాహెర్, మాబూద్, ఫారుఖ్‌అలీ, వహీద్‌సనా, ఇలియాజ్ ముజాహిద్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలో ఎంఐఎం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నామని ఆపార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్ అలి అన్నారు. ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్చర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు యాసిర్, జామిద్, ముబీన్, షకీల్, సాబేర్, మౌలానా పాల్గొన్నారు.



ఎంఐఎం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

అసైన్డ్ భూమిని స్వాధీనపర్చుకోవాలి

జడ్చర్ల: పట్టణ శివారులోని సర్వేనంబర్ 138లో గల అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీన పర్చుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ కార్యదర్శి ప్రణీల్‌చందర్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సర్వేనంబర్ 138లో గల తన పట్టా భూమిని 1965లో అప్పటి ఎమ్మెల్యే కొత్తకేశవులు భూదాన్‌యజ్ఞ బోర్డుకు స్వాధీనపర్చగా అప్పటి ప్రభుత్వం సదరుఅసైన్డ్ భూమిని కావేరమ్మపేటకు చెందిన భూమి లేని నిరుపేదలకు కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. సదరు అసైన్డ్ భూమిని రెవె న్యూ అధికారులు స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని 26 గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై బహిరంగ విచారణ నిర్వహించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కరుణశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివిధ గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులపై డీఆర్‌ఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులకు రూ. 6.70 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు గాను సామాజిక తనిఖీలో రూ. 23,927 మాత్రమే రికవరీకి అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదా బేగం మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ పనులు పకడ్బందీగా గ్రామాలలో నిర్వహించబడేలా చూడాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలలో చేపట్టే ఏ పనులు అయినా పంచాయతీలకే సంబంధం అని, అందువల్ల తప్పనిసరిగా బాధ్యత తీసుకొని పనులు సక్రమంగా నిర్వహించబడేలా చూడాలని అన్నారు. ఈజీఎస్ పనుల నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రతీ గ్రామంలో కూలీలకు పనులు కల్పించే దిశగా కూలీ డబ్బులు అందించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఎంపీఓ శంకర్‌నాయక్, ఈజీఎస్ ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి, ఈసీ అమ్జద్, ఎస్‌ఆర్‌పీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఈజీఎస్ సిబ్బందిని విచారిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదా బేగం